
క్లుప్తంగా

కనుల పండువగా శ్రీవారి గరుడ సేవ



నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి మూలవరులను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మ, స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొత్త హనుమేశ్వరరావు, నరసింహారావు, సీతారామయ్య, అర్చకుడు పరాంకుశం పవన్‌కుమార్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో అర్చకులకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణానికి చెందిన గురజాల గోపి రూ.40 వేల విలువైన నూతన వస్త్రాలను ఆలయ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు చెన్నకేశవరావును అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో కిషోర్‌కుమార్, నూతలపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



సాక్షి స్పందన


పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు– పెనుగంచిప్రోలు రోడ్డుకు శుక్రవారం అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈనెల 17న శ్రీ తిరుపతమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమలు అనిగండ్లపాడు నుంచి రానున్న నేపథ్యంలో ఈనెల 12న 'సాక్షి' దినపత్రికలో 'ప్రమాదం అంచున ప్రయాణం' శీర్షికతో వచ్చిన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. గోతుల్లో కంకర వేసి తారుతో మరమ్మతులు నిర్వహించారు. దీనిపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుదర్శన చక్రం సమర్పణ



తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామికి భక్తుడు పంచలోహ సుదర్శన చక్రం సమర్పించినట్లు ఏసీ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మహంకాళి నరసింహారావు దంపతులు 18 కేజీల పంచలోహ సుదర్శన చక్రాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దీనిని స్వామి అలంకరణకు వినియోగిస్తామని ఆలయ ప్రధానార్చకుడు రామకృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సూర్యాపేట జిల్లాకు చెందిన మైలా నాగేశ్వరరావు దంపతులు రూ.25,116 విరాళంగా అందించారని చెప్పారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

పంచామృత అభిషేకాలు



నందిగామ రూరల్: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో హరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా శుక్రవారం విశేష అర్చనలు, పూజలు చేశారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అర్చకులు తంత్ర పూజలు, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పలు రకాల పుష్పాలతో అష్టోత్తర సహస్రనామ పూజలు, లక్ష్మీ గణపతి, అయ్యప్ప స్వామి మూలమంత్ర హోమాది క్రతువులను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. ప్రజల బెంబేలు



రద్దీగా ఉండే గాంధీ సెంటరు నిర్మానుష్యంగా..



వెలవెలబోతున్న బస్టాండ్ ఏరియా

నందిగామ రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండలు మండుతున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి గంటల తరబడి అనధికార విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు మండి పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై విద్యుత్ శాఖాధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెలవెలబోతున్న ప్రధాన కూడళ్లు..

వారం రోజులుగా భానుడు విజృంభిస్తుండటంతో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్న సమయంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవటంతో పలు ప్రధాన కూడళ్ల నిర్మానుష్యంగా మారాయి. రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా మట్టి కుండలు

చల్లదనం కోసం..

పట్టణంలో పుచ్చకాయలు, శీతలపానియాలు, పండ్ల రసాలు, మజ్జిగ, లస్సీ, తదితర వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. ఫ్రిడ్జిలు, ఏసీలు, కూలర్ల వ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతుండగా పేదల ఫ్రిడ్జిగా పేరొందిన చలువ కుండలను సైజును బట్టి రూ.250 నుంచి రూ.350లకు విక్రయిస్తున్నా కొనే వారు మాత్రం కరువయ్యారని వ్యాపారులు చెబుతున్నారు.

కూలీల పరిస్థితి ..

మిర్చి కోతలకు వెళ్లే కూలీలు, ఉపాధి హామీ పథకం కూలీలు మండుతున్న ఎండలకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఇళ్లపై కూలింగ్ సున్నం వేయిస్తుండగా మరి కొందరు గతేడాది కొనుగోలు చేసి పక్కన పడేసిన కూలర్లను మరమ్మతులు చేయించే పనిలో పడ్డారు.

ఉత్సాహంగా రంగుల సంబరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో హోలీ పండుగ సంబరాలు శుక్రవారం పలువురు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పలు వార్డులలో ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గోర్‌భాయ్ సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు లాహోరి బద్దూనాయక్ నాయకత్వంలో వివిధ వార్డుల నుంచి సుగాలీలు ఊరేగింపుగా వచ్చి అత్యంత ఉత్సాహ భరితంగా నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఉత్సవాలు జరుపుకున్నారు. రంగులు జల్లుకుంటూ నృత్యాలు చేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు న్యాయపరంగా ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తాము వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బద్దూనాయక్, భూక్యా బద్యానాయక్, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ భాణావత్ రాజునాయక్ తదితరులు మాట్లాడుతూ ఈ పండుగ అందరి జీవితాలలో ఆనందం నింపాలని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు ధరావత్ శ్యామల, గోర్‌భాయ్ సేవా సమితి ప్రతినిధులు భూక్యా కృష్ణానాయక్, మోహన్‌దారియా, డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆడోతు బ్రహ్మం, మూడావత్ హరిశ్చంద్ర, వడిత్యా శివలాల్, లాహోరి బాలమ్మ, బాణావత్ బుజ్జి, మహిళలు పాల్గొన్నారు.



నందిగామలో రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న చిన్నారులు



సూర్యానాయక్ తండాలో హోలీ వేడుకల్లో పీఆర్ ఎస్ఈ బాలునాయక్, యువత



జగ్గయ్యపేట పట్టణంలో హోలీ వేడుకల్లో చిన్నారులు



రంగాపురంలో రంగులు చల్లుకుంటున్న మహిళలు

నందిగామ రూరల్: హోలీ పండుగను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కమ్మవారిపాలెం, చెర్వుకొమ్ముపాలెం, పెద్దవరం గ్రామాలలో సుగాలీలతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రజలు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. పట్టణంలోని ఆయా వార్డులలో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కంచికచర్ల: కంచికచర్ల ఇందిరాకాలనీ, సూర్యానాయక్ తండాలో సుగాలీలు శుక్రవారం హోలీ పండుగ జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందగా డీజే పాటలతో డ్యాన్సులు చేశారు. హోలీ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజినీర్ భూక్యా బాలునాయక్ పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సుగాలీలతో కలిసి రంగులు పూసుకుని డ్యాన్స్ వేశారు. ముందుగా సుగాలీలు బాలునాయక్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ టీవీ రవికుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఒంటిపులి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గండేపల్లిలో విద్యార్థులు రంగురంగులు చల్లుకుని హోలీ రంగులు పూసుకుని డ్యాన్స్‌లు వేశారు.

జగ్గయ్యపేట: మండలంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బూదవాడ, ధర్మవరప్పాడుతండా, వేదాద్రి, ముక్త్యాల, రావిరాల గ్రామాలలో సుగాలీలు హోలీ పండుగను వైభవంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వీరులపాడు: హోలీ పండుగకు చల్లుకునే రంగుల మాదిరిగానే మన జీవితాలు కూడా రంగులమయం కావాలని సర్పంచ్ రమావత్ కోటి పేర్కొన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం, అల్లూరు, వీరులపాడు తదితర గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

ఆలయానికి విరాళాలు అందజేత



ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావుకు విరాళం అందజేస్తున్న దాతలు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపమ్మవారి ఆలయానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, మేడ్చల్ ప్రాంతానికి చెందిన సంకూరి హనుమంతరావు, లలిత దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.20,111, గోశాలలో గోవుల సంరక్షణకు రూ.20 వేలు, అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి రూ.10 వేలు విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. బాపట్ల జిల్లా, కర్లపాలెం మండలం, నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన మాడ సుబ్రమణ్యం, పూర్ణలక్ష్మి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.5,116, హైదరాబాద్ కొంపల్లికి చెందిన చెన్ను దేవాన్ష్ రూ.5,001 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

37 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిగామ టౌన్: సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 37 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.53.30 లక్షల విలువైన చెక్కులను స్థానిక కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌మంజూరు చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి నేతలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఈఈ రమ

పెనుగంచిప్రోలు: వేసవి తీవ్రత దృష్ట్యా శ్రీతిరుపతమ్మవారి చిన్నతిరునాళ్లలో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆలయ ఈఈ ఎల్.రమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆలయం చుట్టూ 4 ఆర్ఓ ప్లాంట్లు నిత్యం భక్తులకు శుద్ధజలాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటాయన్నారు. వీటికి తోడు 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లుతో పాటు ఆలయం చుట్టూ చలివేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కాళ్లు కాలకుండా ఆలయం చుట్టూ సీసీ రోడ్డుపై ట్యాంకర్లతో నీటిని చల్లిస్తామన్నారు. అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమలు వచ్చే రోజు మార్చి 17న అనిగండ్లపాడు నుంచి ఆలయం వరకు కూడా రోడ్లపై ట్యాంకర్లతో నీటిని చల్లించే ఏర్పాటు చేశామన్నారు. మునేరులో భక్తులకు 300 షవర్‌బాత్‌లు, తాత్కాలికంగా టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు.

క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి

నందిగామ రూరల్: క్రైస్తవులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు మార్కపూడి డేవిడ్ పేర్కొన్నారు. స్థానిక బాబూజగ్జీవన్ రామ్ భవన్‌లో శుక్రవారం క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవులంతా ఒకతాటిపై ఉండాలన్నారు. రానున్న కాలంలో నాలుగు మండలాల పరిధిలో కమిటీలు వేసి క్రైస్తవులను ఏకం చేయటం జరుగుతుందని తెలిపారు. ఫాస్టర్‌లు జాన్, రాంబాబు, జాన్‌విక్టర్ బాబు, హనుమంతరావు, న్యాయవాది అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారం అమృతాహారం



పట్టణంలో అవగాహన ర్యాలీలో పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ సభ్యులు

నందిగామ రూరల్: శాఖాహారం అమృతాహారమని పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ మండల సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని పిరమిడ్ ధ్యాన మందిరం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో శుక్రవారం మహాకరుణ అహింసా– శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస చేయటం వల్ల పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. మాంసాహారం తినటం వల్ల జీవ హింసతో పాటు అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాంసాహారాన్ని విడనాడి శాఖాహారం తీసుకోవాలని సూచించారు. సొసైటీ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, శారద, రామకృష్ణ, మాదవరావు పాల్గొన్నారు.

75 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కో వైద్యుడు రాజా కేశవ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం 75 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

నందిగామ టౌన్: స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వినియోగంపై వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కన్నా తక్కువ సాంద్రత కలిగిన ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమన్నారు. పట్టణంలోని హోటల్ యజమానులు, టిఫిన్ సెంటర్‌లు, కర్రీ పాయింట్‌లు, టీ స్టాల్స్, తదితర వ్యాపార నిర్వాహకులకు ప్లాస్టిక్‌ను ఒక్కసారి మాత్రమే వినియోగించే అనే అంశంపై స్థానిక బాబూజగ్జీవన్‌రామ్ భవన్‌లో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో అన్ని వర్గాల వ్యాపారులు పాల్గొనాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



తన్నీరును కలిసిన రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీలో వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు ఆయా ప్రాంతాల్లో అందరినీ కలుపుకొనిపోతూ ముందుకు సాగాలని, తద్వారా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన బత్తుల రామారావు శుక్రవారం పలువురు నాయకులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం వలన ఏడాది లోపులోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రామారావుతో పాటు మండల సోషల్ మీడియా కన్వీనర్ నల్లబోతుల వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు వడిదేల నాగుల్‌మీరా, బీసీ యూత్ సభ్యులు బొజ్జా సాయి, న్యాయవాది బత్తుల నవీన్, డాక్టర్ శివరాంబొట్ల వెంకటేష్, వడిదేల సాయి, చేని మహేష్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



ఎస్ఏ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కంచికచర్ల: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచాలని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని శుక్రవారం గ్రామ సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాదబీమా అమలయ్యేలా చూడాలన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ. 21 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. 17న విజయవాడ మహా ధర్నాను విజయవంతం చేసేందుకు కార్మికులందరూ రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు,

వైభవంగా వత్సవాయమ్మ కల్యాణం



అమ్మవారి కల్యాణంలో భక్తులు

వత్సవాయి: స్థానిక శ్రీరామ జగపతి దేవ సమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి కల్యాణం గురువారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త గుత్తా కృష్ణమూర్తి తరుపున వారి సంతానం పీటలపై కూర్చుని అమ్మవారి కల్యాణాన్ని జరిపించారు. అమ్మవారి కల్యాణం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దీక్షాస్వాముల ఇరుముడులు, జలబిందెల మహోత్సవాన్ని నిర్వహించారు.

వేదోక్తంగా చెన్నకేశవ స్వామి కల్యాణం..

నందిగామ టౌన్: స్థానిక భూనీలా సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం వేదోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మ, స్వామి వారిని ఆలయ అర్చకులు దివి రత్నమాచార్యులు, అదోక్షజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష అర్చనాది పూజలు చేశారు. అనంతరం వైఖానస సంప్రదాయం పద్ధతిలో దివ్య కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రజా చైతన్యయాత్రలు



మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

వత్సవాయి: ఈ నెల 18 నుంచి మండలంలో ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వత్సవాయిలో సీపీఎం కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాల్లో స్థానిక సమస్యలపై బృందాలుగా ఏర్పడి ప్రజాసమస్యలను తెలుసుకుంటామన్నారు. వచ్చిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషిచేస్తామన్నారు. లింగాల బ్రిడ్జికి మరమ్మతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏడు నెలల క్రితం వచ్చిన వరదలకు బ్రిడ్జి మొత్తం దెబ్బతిని ప్రమాదకరంగా మారినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మండల కమిటీ సభ్యులు మండేపుడి చంద్రశేఖర్, కంచర్ల కొండయ్య, మండల పార్టీ కార్యదర్శి బి.రాము, వెంకయ్య, కరిసె రత్నబాబు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో వెతలు

నందిగామ టౌన్: గత వారం రోజులుగా అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నా శుక్రవారం మాత్రం మధ్యాహ్నం రెండు గంటల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నాలుగు గంటల నుంచి పూర్తిగా సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరా కాలేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో సమాచారం కనుక్కుందామని విద్యుత్ శాఖ కార్యాలయానికి ఫోన్ చేస్తే స్పందించే వారు కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారులు,

సమాచారం తెలిపే వారు కరువు

ప్రజలకు కనీస విలువ లేకుండా పోతోందంటున్నారు. కార్యాలయానికి వెళ్లి ఏదైనా సమాచారం తెలుసుకుందామన్నా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారు. వినియోగదారుల సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదని మండిపడుతున్నారు. ఏదైనా అడుగుదామన్నా అధికారులు, సిబ్బంది విసుక్కుంటున్నారని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జామా మసీదులో ఇఫ్తార్ విందు



నందిగామ టౌన్: పట్టణంలోని జామా మసీదులో (పెద్ద మసీదు) శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ముతవల్లి మహ్మద్ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ముఫ్తీ హీలం సూచనలు, సలహాలు, బోధనలు మానవాళికి ఆదర్శనీయమైనవన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలోని భక్తిభావం, పవిత్రత, సేవా సంప్రదాయం, కట్టుబాట్లకు నిదర్శమని తెలిపారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత గురువులు సయ్యద్ సలీముద్దిన్, రజీవ్, సాధిక్ రజా, ఎండీ ఆరిఫ్ రాజా, మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.